సాక్షి ఖమ్మం

ఆదివారం । 21 । జనవరి । 2024



నాణ్యత ఆధారంగానే సిరులు

మిర్చి సాగు చేసిన రైతులు తగిన జాగ్రత్తలు పాటిస్తూ మార్కెట్‌కు తీసుకొస్తేనే మంచి ధర లభిస్తుందని అధికారులు చెబుతున్నారు. 8లో



కళాశాలలో అల్పాహారం

కల్లూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు పూర్వవిద్యార్థుల చేయూతతో అల్పాహారం సమకూరుస్తున్నారు. 8లో

గరిష్టం / కనిష్టం 31° / 18°

వాతావరణం

జిల్లాలో ఆదివారం ఉదయం, రాత్రి చలి ప్రభావం పెరుగుతుంది. మధ్యాహ్నం మాత్రం సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతాయి.

న్యూస్‌రీల్

జమలాపురంలో శ్రీవారికి ప్రత్యేక పూజలు



స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న జమలాపురంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో మూలవిరాట్‌తో పాటు శ్రీవారి పాదానికి పంచామృతాలతో అభిషేకాలు జరిపించారు. ఆతర్వాత స్వామి, అమ్మవార్లను పట్టువస్త్రాలతో అలంకరించి నిత్యకల్యాణం జరిపించడమే కాక పల్లకీసేవ నిర్వహించారు. తెలంగాణ, ఏపీలోని వివిధ ప్రాంతాల భక్తులు పెద్దసంఖ్యలో పూజల్లో పాల్గొని మొక్కులు చెల్లించారు. ఆలయ ఈఓ జగన్మోహన్‌రావు, సూపరింటెండెంట్ విజయకుమారి, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ స్టడీ సర్కిల్‌లో గ్రూప్స్‌కు ఉచిత శిక్షణ

ఖమ్మంమయూరిసెంటర్: బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యాన ఖమ్మంలోని బీసీ స్టడీ సర్కిల్‌లో గ్రూప్–1, 2, 3, 4, ఫౌండేషన్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఇందుకోసం ఆసక్తి ఉన్న ఉమ్మడి జిల్లాలోని అభ్యర్థులు ఈనెల 24వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని స్టడీ సర్కిల్ డైరెక్టర్ జి.శ్రీలత సూచించారు. నాలుగు నెలల పాటు కొనసాగే శిక్షణలో స్టడీ మెటీరియల్ కూడా ఉచితంగా అందిస్తామని తెలిపారు. పూర్తి వివరాల కోసం 08742–227427, 95738 59598, 94419 31359 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ప్రశాంతంగా 'నవోదయ' పరీక్ష

- 2,492 మంది విద్యార్థులు హాజరు



ఖమ్మంలోని కేంద్రంలో పరిశీలిస్తున్న డీఈఓ, ప్రిన్సిపాల్

కూసుమంచి: పాలేరులోని జవహర్ నవోదయ విద్యాలయలో 2024–25 విద్యా సంవత్సరానికి గాను ఆరో తరగతిలో ప్రవేశాలు కల్పించేందుకు శనివారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఆరో తరగతిలో 80సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానించగా 3,140 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఈమేరకు ఉమ్మడి జిల్లాలో ఏర్పాటుచేసిన 19కేంద్రాలకు 2,492 మంది హాజరుకాగా, 648 మంది గైర్హాజరయ్యారు. కాగా, పలు పరీక్ష కేంద్రాలను డీఈఓ సోమశేఖరశర్మ, నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసులు పర్యవేక్షించారు.

డీసీఎస్‌ఓగా బాధ్యతలు స్వీకరించిన చందన్



కలెక్టర్‌కు పూలమొక్క అందజేస్తున్న డీసీఎస్‌ఓ

ఖమ్మం సహకారనగర్: జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి(డీసీఎస్‌ఓ)గా కె.చందన్‌కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన జిల్లా కలెక్టర్ గౌతమ్, అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే, చందన్‌కుమార్‌ను పౌరసరఫరాల శాఖ ఉద్యోగులు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

పకడ్బందీగా సిటీ పోలీస్ యాక్ట్ అమలు

ఖమ్మంక్రైం: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న 104 మందిపై సిటీ పోలీస్ యాక్ట్ కింద కేసులు నమోదు చేసినట్లు పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ తెలిపారు. కమిషనరేట్ పరిధిలో సిటీ పోలీస్ యాక్ట్ పక్కాగా అమలు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఈమేరకు బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం, పరిమితికి మించి వేగంగా డ్రైవింగ్, నిర్ణీత సమయం తర్వాత షాపులు తెరిచి ఉంచడం, రహదారులపై పార్టీలు చేసుకోవడం వంటి ఘటనలకు పాల్పడే వారిని సిటీ పోలీస్ యాక్టు అమలు చేసి కోర్టులో హాజరుపరుస్తామని పేర్కొన్నారు. ఆయా వ్యక్తులకు జరిమానా, జైలు శిక్ష పడే అవకాశముంటుందని సీపీ శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు.

అంతా రామమయం!

రేపు అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ

- జిల్లాలో శోభాయాత్రలు, అన్నదానానికి ఏర్పాట్లు
- ఇప్పటికే అంతటా పండుగ వాతావరణం
- ఇంటింటికీ అక్షింతలు పంపిణీ.. ఇళ్లపై జెండాలు



కామేపల్లి మండలం జోగ్గూడెంలో అక్షింతలతో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు



ఇంటిపై జెండా ఎగురవేస్తున్న భక్తుడు

'రామో విగ్రహవాన్ ధర్మః' అని శత్రువులు సైతం శ్రీరామచంద్రుడిని కీర్తించారు. శ్రీరాముడు జన్మించిన అయోధ్య(సాకేతపురి) పట్టణంలో ఆయన కుమారుడు కుశ మహారాజు రామ్‌లల్లా ఆలయాన్ని నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది. అదే స్థానంలో నూతనంగా ఆలయాన్ని నిర్మించగా.. సోమవారం అక్కడ శ్రీ బాలరామ విగ్రహ ప్రతిష్ఠాపన చేయనున్నారు. ఈ సందర్భంగా జిల్లాలోనూ పండుగ వాతావరణం నెలకొంది. – ఖమ్మంగాంధీచౌక్

విగ్రహ ప్రతిష్ఠాపనను పురస్కరించుకుని భక్తులు తమ ఇళ్లపై ఆంజనేయ స్వామి, సీతారామచంద్ర స్వామి ఉన్న జెండాలను ఎగురవేశారు. మరికొందరు వాహనాలకు సైతం జెండాలు అమర్చుకున్నారు. అలాగే, ఇళ్లు, వ్యాపారసంస్థల ప్రధాన ద్వారాలకు రాముడి చిత్రంతో కూడిన స్టిక్కర్లు అంటించి భక్తిప్రపత్తులు చాటుతున్నారు.

శోభాయాత్రలు, ర్యాలీలు

అయోధ్యలో సోమవారం విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ జరగనుండగా అదే రోజు భక్తులు ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణకు సిద్ధమయ్యారు. ప్రతిష్ఠ జరిగే ముహూర్తంలోనే శోభాయాత్రలు, భజనలతో ప్రదర్శనలు నిర్వహించనున్నారు. అలాగే, ఆలయాలు, ప్రధాన కూడళ్లలో అన్నదానం ఏర్పాటుచేస్తున్నారు. అంతేకాక అయోధ్యలో జరిగే మహత్తర కార్యక్రమాన్ని వీక్షించే భక్తుల కోసం ఖమ్మం నగరంతో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ప్రత్యేక స్క్రీన్లు సిద్ధమవుతున్నాయి.

ఆలయాల్లో పరిశుభ్రత, ప్రత్యేక కార్యక్రమాలు

విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా జిల్లాలోని రామాలయాల్లో ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు జరుగుతున్నారు. ఇప్పటికే ఆలయాల పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించగా... అయోధ్యలో జరిగే కార్యక్రమాల వివరాలు.. ప్రత్యేకతలపై ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అలాగే, సోమవారం రోజంతా ఆలయాల్లో నిరంతరాయంగా రామనామ సంకీర్తనలు జరగనుంది. ఆలయాలు, ఇళ్లకు మామిడి తోరణాలు కట్టనుండగా పండుగ వాతావరణం ఉట్టిపడనుంది.

అక్షింతల పంపిణీ

బాలరాముడి ప్రాణప్రతిష్ఠ సందర్భంగా నెల క్రితమే అయోధ్యకు చెందిన వివిధ సంస్థలు అక్షింతల పంపిణీని చేపట్టాయి. జిల్లాకు చేరుకున్న అక్షింతలను ఆలయాల్లో పూజల అనంతరం సంస్థల ప్రతినిధులు బృందాలుగా ఏర్పడి జిల్లా అంతటా భక్తులకు అందజేస్తున్నారు. దీంతో ప్రజలు సైతం భక్తిశ్రద్ధలతో కార్యక్రమంలో పాల్గొని బృందాలకు స్వాగతం పలికారు. అయోధ్యలో సోమవారం నిర్వహించే విగ్రహ ప్రతిష్ఠాపన రోజు అక్షింతల వినియోగాన్ని వివరించారు. అక్షింతల పంపిణీ సందర్భంగా పట్టణాలు, గ్రామాల్లో శోభాయాత్రలు నిర్వహించారు.

మహత్తరమైన ఘట్టం



ఎంతో మహత్తరమైన ఘట్టం మనం చూస్తుండగా నెరవేరడం ఆనందంగా ఉంది. బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. సోమవారం జిల్లా వ్యాప్తంగా పండుగ వాతావరణం నెలకొంటుంది.

– ఆమంచి సురేష్‌శర్మ, అర్చకుడు, ఖమ్మం

వేడుకగా జరుపుకుంటాం..



అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా శోభాయాత్రలు నిర్వహించి అక్షింతలు పంపిణీ చేశాం. సోమవారం రామాలయాల్లో ప్రత్యేక పూజలు జరగనున్నాయి. అలాగే, శోభాయాత్రలు, రామనామ సంకీర్తన నిర్వహించనున్నాం.

– వడ్డే లక్ష్మీ, శ్రీ బాలాజీ సేవా సమితి, ఖమ్మం

బాల'రామాయణం!



భట్లపెనుమర్తి సూర్యనారాయణతో పాటు బి.వెంకటేశ్వరరావు, రాజేశ్వరశర్మ, శ్రీదేవి పాల్గొన్నారు.

ఎర్రుపాలెం: అయోధ్యలో బాలరాముడి విగ్రహాన్ని సోమవారం ప్రతిష్ఠించనుండగా.. ఎర్రపాలెం మండలం మీనవోలులోని శ్రీ భాస్కర మెమోరియల్ ఉన్నత పాఠశాలలో శనివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు రాముడు, సీతాదేవి, లక్ష్మణమూర్తి తదితరుల వేషధారణల్లో రామాయణ ఘట్టాలను ప్రదర్శించారు. కరస్పాండెంట్

ఫిబ్రవరి 7వరకు పుష్‌పుల్

ఖమ్మం మామిళ్లగూడెం: కొద్దినెలల క్రితం రద్దు చేసిన పుష్‌పుల్ రైలును సంక్రాంతి సందర్భంగా పునరుద్ధరించినా కొన్నిరోజుల పాటే నడుపుతామని చెప్పిన అధికారులు మరికొన్నాళ్లు పొడిగించారు. ఈమేరకు డోర్నకల్ – విజయవాడ(07755), విజయవాడ – డోర్నకల్ (07756) పుష్‌పుల్ ప్యాసింజర్ ఫిబ్రవరి 7వ తేదీ వరకు రాకపోకలు సాగిస్తుందని సీసీఐ ఎం.డీ.జాఫర్ తెలిపారు. ఈ రైలును 20వ తేదీ వరకే నడుపుతామని అధికారులు తొలుత వెల్లడించిన విషయం విదితమే.

సాహిత్యంపై అవగాహన అవసరం



బహుమతులు అందుకున్న విద్యార్థులతో నిర్వాహకులు


- స్టేట్ ఆడిట్ శాఖ డీడీ వీఆర్.తూములూరి
- కొత్తగూడెంలో ముగిసిన కథా, కవితా కార్యశాల

కొత్తగూడెంటౌన్: విద్యార్థి దశ నుంచే సాహిత్యంపై అవగాహన కల్పించాల్సిన అవసరముందని.. తద్వారా భవిష్యత్‌లో మంచి రచనలు వెలువడతాయని కవి, స్టేట్ ఆడిట్ డిపార్టుమెంట్ డిప్యూటీ డైరక్టర్ వీ.ఆర్ తూములూరి తెలిపారు. కొత్తగూడెం క్లబ్‌లో బాలోత్సవ్ ఆధ్వర్యాన రెండు రోజులుగా కథా, కవితా కార్యశాల శనివారం ముగిసింది. ఈ సందర్భంగా బాలోత్సవ్ జాతీయ కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రమేశ్‌బాబు అధ్యక్షతన ఏర్పాటుచేసిన సమావేశంలో వీఆర్.తూములూరి మాట్లాడుతూ కార్యశాల ఏర్పాటుతో విద్యార్థుల్లో సాహిత్యాభిలాష పెంపొందించడం అభినందనీయమని తెలిపారు. కాగా, ఉమ్మడి జిల్లా నుంచి 500 మందికి పైగా విద్యార్థులు హాజరుకాగా కవులు, రచయితలు పాల్గొని రచనలపై అవగాహన కల్పించారు. అలాగే, శనివారం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో కిలారి స్వర్ణ, కోట్టం రామకృష్ణారెడ్డి, ఎలియామన్నె, అనిల్‌డ్యానీ, కోనూరి రవికుమార్, డాక్టర్ కటుకోజ్వల రమేష్, భగవంతంతో పాటు వెంకట్రావు, మల్సూర్, సూర్యనారాయణ పాల్గొన్నారు.

విజేతలు వీరే...

కథ, కవిత పోటీల్లో విద్యార్థులు 200కు రచనలతో ప్రతిభ చాటుకున్నారు. 'రంగుల కల' అంశంపై 120మంది విద్యార్థులు కవితలు రచించగా జి.మౌనశ్రీ(కేటీపీఎస్), బి. వివేక్(నవభారత్), జె.రాజేశ్వరి (పాల్వంచ) మొదటి మూడు బహుమతులు గెలుచుకోగా, జి.భూమిశ్రీ(హేమచంద్రాపురం), కె.ధరణి(నవభారత్)కు కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. అలాగే, కథల పోటీల్లో శ్రీవల్లి(పాల్వంచ), తోట అజయ్‌కుమార్(తల్లాడ), బి.లహరి(అశ్వాపురం) మొదటి మూడు స్థానాల్లో నిలవగా ఎండీ.సుహానా(రుద్రంపూర్), వి.రమ్య(అన్నపురెడ్డిపల్లి) కన్సోలేషన్ బహుమతులు గెలుచుకున్నారు.

సింగరేణి డైరెక్టర్(పా)గా శ్రీనివాస్



ఎన్వీకే.శ్రీనివాస్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ డైరెక్టర్ (పా)గా డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎన్వీకే.శ్రీనివాస్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు సీఎండీ ఎన్.బలరామ్ శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. 1983లో శ్రీనివాస్ ఎంజీటీగా బాధ్యతలు చేపట్టి వివిధ హోదాల్లో పనిచేస్తూ 2019లో జనరల్ మేనేజర్‌గా పదోన్నతి పొందారు. 2023 ఫిబ్రవరి 1న డైరెక్టర్ (ఆపరేషన్స్)గా నియమితులైన ఆయన సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహిస్తుండడంతో డైరెక్టర్(పా)గా పదోన్నతి లభించింది. గతంలో డైరెక్టర్(పా) అదనపు బాధ్యతలు నిర్వర్తించిన బలరామ్ ఈనెల 3న సీఎండీగా నియమితులు కావడంతో ఆ బాధ్యతలు శ్రీనివాస్‌కు అప్పగించారు.

మహిళా డిగ్రీ కళాశాలకు ఐఎస్ఓ గుర్తింపు

ఖమ్మంరూరల్: మండలంలోని కోదాడ క్రాస్ రోడ్డులో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలకు ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ స్టాండరైజేషన్(ఐఎస్ఓ) గుర్తింపు లభించింది. విద్యాబోధనలో పాటిస్తున్న నాణ్యతకు గాను ఈ గుర్తింపు పత్రాన్ని నిర్వాహకులు శనివారం ప్రిన్సిపాల్ డాక్టర్ ఝున్సీరాణికి అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్, అధ్యాపకులు, కళాశాల సిబ్బందిని ఖమ్మం రీజినల్ కోఆర్డినేటర్ ఆర్.ప్రత్యూష అభినందించారు.



కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందంతో ఆర్‌సీఓ ప్రత్యూష

రండి.. రారండి!

శరవేగంగా గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు

- వచ్చేనెల 6వ తేదీ వరకు అవకాశం
- అర్హులంతా నమోదయ్యేలా అధికారుల ప్రత్యేక దృష్టి
- వరుస సమీక్షలతో అవగాహన కల్పిస్తున్న కలెక్టర్



ఓటరు దరఖాస్తులు నమోదు చేస్తున్న దృశ్యం (ఫైల్)

సాక్షిప్రతినిధి, ఖమ్మం: వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల నియోజవర్గంలో గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు ఊపందుకుంది. ఈ నియోజకవర్గానికి ఎమ్మెల్సీగా ఉన్న పల్లా రాజేశ్వరరెడ్డి జనగామ ఎమ్మెల్యేగా ఎన్నికవడంతో ఉపఎన్నిక అనివార్యమైంది. దీంతో ఎన్నికల సంఘం ఓటరు నమోదుకు షెడ్యూల్ విడుదల చేసింది. ఈక్రమంలో కలెక్టర్ ప్రత్యేక చొరవతో ఇప్పటివరకు జిల్లాలో 17,113 మంది పట్టభద్రులు దరఖాస్తు చేసుకున్నారు. ఇంకా సమయం ఉన్నందున అర్హులంతా దరఖాస్తు చేసుకునేలా అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

ఎక్కువగానే ఆన్‌లైన్‌లో...

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు సంబంధించి ఓటరు జాబితా రూపకల్పనకు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఓటరు నమోదుకు ఎన్నికల కమిషన్ గత నెల 30న నోటీస్ జారీ చేసింది. ఫాం–18 ద్వారా వచ్చేనెల 6 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. 2020 నవంబర్ 1వ తేదీ వరకు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారు ఓటుహక్కు నమోదు చేసుకోవచ్చు. ఎక్కువమంది ఆన్‌లైన్ ద్వారానే దరఖాస్తు చేసుకుంటున్నట్లు అధికారులు చెబుతున్నారు. అయితే, ప్రతి గ్రాడ్యుయేట్‌తో ఓటరుగా నమోదు చేయించాలనే లక్ష్యంతో అధికారులు విస్తృత ప్రచారం చేస్తున్నారు. పాత జాబితా ఆధారంగా అర్హులంతా నమోదు చేసుకున్నారా, లేదా అని కూడా పరిశీలిస్తున్నారు. ఓటర్ల నమోదు ప్రక్రియ పూర్తయిన అనంతరం ఏప్రిల్ 4న ఓటర్ల జాబితా విడుదల చేస్తారు.

అందరూ నమోదు చేసుకునేలా..

ఓటరు నమోదు అత్యధికంగా జరిగేలా అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఈ విషయమై రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్నారు. గతంలో గ్రాడ్యుయేట్ ఓటర్లుగా నమోదైన వారే కాక, కొత్త వారు సైతం మళ్లీ నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. దీంతో కలెక్టర్ సూచనల మేరకు అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. ఆర్డీఓ, సంబంధిత అధికారులు ఓటరు నమోదు కోసం స్పెషల్ క్యాంపెయిన్లు చేపట్టారు. ఇక పలు యువజన సంఘాల ఆధ్వర్యాన సైతం తమ కార్యాలయాల్లో ఉచితంగా ఆన్‌లైన్ నమోదు చేస్తున్నారు.

17,113 మంది నమోదు

జిల్లాలో ఇప్పటి వరకు 17,113 మంది గ్రాడ్యుయేట్లు తమ ఓటును నమోదు చేసుకున్నారు. వచ్చే నెల 6 వరకు గడువు ఉండడంతో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశముంది. మొత్తం ఓటర్లలో ఆన్‌లైన్ ద్వారా 17,079 మంది దరఖాస్తు చేసుకోగా.. నేరుగా 34 మంది దరఖాస్తులు అందజేశారు. ఇందులో అత్యధికంగా ఖమ్మం అర్బన్ మండలంలో 5,575 మంది, ఖమ్మం రూరల్ మండలం నుంచి 1,421 మంది దరఖాస్తు చేసుకోగా.. ఏన్కూరు మండలంలో ఇప్పటివరకు 328దరఖాస్తులు మాత్రమే అందాయి. ఇక నియోజకవర్గ కేంద్రమైన సత్తుపల్లి మండలం నుంచి 687దరఖాస్తులు రాగా, ఇదే నియోజకవర్గమైన కల్లూరు మండలం నుంచి 725 దరఖాస్తులు రావడం విశేషం. కాగా, ఈ దరఖాస్తులు వివిధ స్థాయిల్లో పరిశీలనలో ఉన్నాయి.

మండలాల వారీగా అందిన దరఖాస్తులు

మండలం	దరఖాస్తులు	మండలం	దరఖాస్తులు
ఖమ్మం అర్బన్	5,575	రఘునాథపాలెం	510
ఖమ్మం రూరల్	1,421	తిరుమలాయపాలెం	509
మధిర	777	ముదిగొండ	505
కల్లూరు	725	కొణిజర్ల	481
నేలకొండపల్లి	692	బోనకల్	456
సత్తుపల్లి	687	ఎర్రుపాలెం	426
వైరా	632	కామేపల్లి	394
కూసుమంచి	623	పెనుబల్లి	392
సింగరేణి	572	వేంసూరు	366
తల్లాడ	521	ఏన్కూరు	328
చింతకాని	521	మొత్తం	17,113

ఓటరుగా నమోదు చేయించుకోండి

స్పెషల్ సమ్మరీ రివిజన్‌ను పరిశీలించిన కలెక్టర్



ఓటరు జాబితాను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మం అర్బన్: ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా రానున్న లోక్‌సభ ఎన్నికల కోసం అర్హులందరూ ఓటరుగా నమోదు చేయించుకోవాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. జిల్లాలో శని, ఆదివారాలు పోలింగ్ బూత్‌ల్లో దరఖాస్తులు స్వీకరించనుండగా, శనివారం ఖమ్మం రోటరీనగర్ జెడ్పీ హైస్కూల్‌లో పరిశీలించారు. అర్హులు కొత్త ఓటరుగా నమోదు కోసమే కాక మార్పులు, చేర్పుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. పోలింగ్ బూత్‌ల్లోని ఉద్యోగుల వద్ద ఓటరు జాబితాలు సరిచూసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, తహసీల్దార్ స్వామి, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



కారేపల్లి : దరఖాస్తులపై ఆరా తీస్తున్న అదనపు కలెక్టర్ మధుసూదన్

కామేపల్లి/కారేపల్లి: అర్హులైన ప్రతీఒక్కరూ ఓటరుగా నమోదు చేయించుకునేందుకు ఉన్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ సూచించారు. కామేపల్లి మండల కేంద్రంతో పాటు కారేపల్లి మండలం గిద్దవారిగూడెం పోలింగ్ కేంద్రాన్ని శనివారం తనిఖీ చేసిన ఆయన ఉద్యోగులకు సూచనలు చేశారు. 18ఏళ్లు నిండిన వారంతా ఓటరుగా దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. తహసీల్దార్ సుధాకర్, ఉద్యోగులు శంకర్, పెండ్ర అనిల్‌కుమార్, పార్వతి, వసంత, లక్ష్మి, నర్సింహారావు, లోకేశ్వరి పాల్గొన్నారు.

నిబంధనలు పాటిస్తేనే ప్రమాదాలకు దూరం



వాహనదారుడికి పూలు ఇస్తున్న అధికారులు

ఖమ్మంక్రైం: ప్రతీ వాహనదారుడు రహదారి నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాల బారిన పడకుండా కాపాడుకోవచ్చని జిల్లా రవాణా శాఖాధికారి ఎం.డీ.గౌస్‌పాషా తెలిపారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా ఖమ్మంలోని రవాణా శాఖ కార్యాలయంలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీఓ మాట్లాడుతూ కార్లలో వెళ్లేవారు సీట్‌బెల్ట్, ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారు హెల్మెట్ ధరించడంతో పాటు ప్రయాణంలో మద్యానికి దూరంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు వాహనదారులకు గులాబీ పూలు ఇచ్చి సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో ఎంవీఐ వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

9999 @ రూ.11,11,190

ఖమ్మంక్రైం: జిల్లాకు చెందిన ఓ వ్యక్తి తన కారుకు అత్యధిక ధర చెల్లించి ఫ్యాన్సీ నంబర్ దక్కించుకున్నాడు. జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో శనివారం వరుస క్రమాన టీఎస్ 04ఎఫ్‌కే 9999 నంబర్ వచ్చింది. ఈమేరకు ఆన్‌లైన్‌లో బిడ్డింగ్ నమోదు చేయగా మందాడ శ్రీనివాసరావు తన కారు కోసం రూ.11,11,190 చెల్లించాడు. ఇదే నంబర్ కోసం పలువురు పోటీ పడినా శ్రీనివాసరావు చెల్లించిన మొత్తమే ఎక్కువ కావడంతో ఆయనకు నంబర్ కేటాయించారు. కాగా, ఇంకొన్ని నంబర్లతో కలిపి శనివారం ఒకేరోజు శాఖకు రూ.12,49,585 ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు.

క్లుప్తంగా

క్యాలెండర్లు ఆవిష్కరించిన కలెక్టర్



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యాన రూపొందించిన క్యాలెండర్లను కలెక్టర్ వీ.పీ.గౌతమ్, అదనపు కలెక్టర్ ఎస్.మధుసూదన్ నాయక్ శనివారం వేర్వేరుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ సంఘం ఆధ్వర్యాన క్యాలెండర్లు రూపొందించడంఅభినందనీయమన్నారు. సంఘం గౌరవ అధ్యక్షుడు వి.వెంకన్న, జిల్లా అధ్యక్షుడు బిక్కుతో పాటు కోడి లింగయ్య, వసంతరావు, వెంకటరమణ, చావా నారాయణరావు, వీరమణి, సునీత, అంజి, తలారి వెంకటేశ్వర్లు, సైదులు, ప్రమోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తమ్మినేనిని పరామర్శించిన మాజీ మంత్రి పువ్వాడ



తమ్మినేనితో మాట్లాడుతున్న అజయ్‌కుమార్

ఖమ్మంమయూరిసెంటర్: హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంను మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ శనివారం పరామర్శించారు. ఈసందర్భంగా వైద్యసేవలపై ఆరా తీసిన పువ్వాడ... త్వరగా కోలుకుని రావాలని ఆకాంక్షించారు.

23న చిత్రలేఖనం పోటీలు

ఖమ్మంరూరల్: ఖమ్మం రూరల్ మండలం పోలేపల్లిలోని కేంద్రీయ విద్యాలయంలో ఈనెల 23న విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ కవీంద్రరాయ్ తెలిపారు. జిల్లాలోని పాఠశాలల్లో 5 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈనెల 22న సాయంత్రం 3గంటల్లోగా విద్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

నాణ్యత ఆధారంగానే సిరుల 'పంట'

- మిర్చిలో తేమ 10 శాతానికి మించి లేకుండా ఎండపెట్టాలి
- తాలు, మచ్చకాయలు తీసేస్తూ గ్రేడింగ్ తప్పనిసరి
- 49 కిలోల లోపు బస్తాల్లో తీసుకొస్తేనే మేలు
- రైతులకు మార్కెటింగ్ శాఖ సూచనలు



విదేశాలకు ఎగుమతి చేసే మిర్చిని గ్రేడింగ్ చేస్తున్న కూలీలు

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం మార్కెట్‌లో మిర్చి విక్రయాలు రోజురోజుకు ఊపందుకుంటున్నాయి. ఇదే సమయాన ధర పడిపోతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈమేరకు అధికారులు రంగంలోకి పర్యవేక్షిస్తున్నా నాణ్యత లేకపోవడంతోనే ధర రావడం లేదని వ్యాపారులు చెబుతున్నారు. కాగా, రాష్ట్ర వ్యాప్తంగా 3.58 లక్షల ఎకరాల్లో మిర్చి సాగు చేస్తుండగా, అత్యధికంగా ఖమ్మం జిల్లాలో 91,500 ఎకరాల్లో, భద్రాద్రికొత్తగూడెం జిల్లాలో 23,341 ఎకరాల్లో సాగవుతోంది. ఇక్కడ సాగయ్యే 'తేజా'రకం మిర్చికి విదేశాల్లోనూ డిమాండ్ ఉన్న నేపథ్యాన సాగు చేసే రైతుల సంఖ్య పెరుగుతున్నప్పటికీ ధర విషయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ మేరకు అధికారులు సరైన ధర లభించేలా రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

రెండో కోతలోనే నాణ్యత..

సాధారణంగా మిర్చి మొదటి కోత(మైల కాయ) కన్నా రెండో కోత నాణ్యతగా ఉండి మంచి ధర పలకుతుంది. విదేశీ ఎగుమతిదారులు సైతం రెండో కోత పంటను కొనుగోలు చేసి మరోసారి గ్రేడింగ్ చేస్తారు. ప్రస్తుతం మార్కెట్‌కు మొదటి, రెండో కోత పంట విక్రయానికి వస్తోంది. ఈ ఏడాది అనుకూలించని వర్షాలు, తెగుళ్లతో దిగుబడి తగ్గింది. అంతేకాక మిర్చిని ఆరబెట్టే కొద్ది రంగు మారుతూ, తాలు శాతం పెరుగుతోంది. తెగుళ్ల కారణంగా కాయపై మచ్చ కూడా రావడంతో ధర తగ్గుతోందని వ్యాపారులు చెబుతున్నారు. ఈమేరకు రైతులు తగిన జాగ్రత్తలు తీసుకుంటే మెరుగైన ధర దక్కించుకునే అవకాశముంటుంది.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి..

కాయ కోసే ముందు సస్యరక్షణ మందులు పిచికారీ చేయరాదు. తద్వారా కాయలపై అవశేషాలు ఉండవు. మిర్చిని పాలిథిన్ పట్టా లేదా సిమెంట్ కాంక్రీట్ గచ్చు(కల్లం)పై ఎండబెట్టాలి. రాత్రి వేళ మంచుతో తడపకుండా కవర్లు కప్పాలి. మిరపలో 10 శాతానికి మించి ఎక్కువ తేమ ఉండకుండా ఎండబెట్టాలి. ఎండబెట్టేటప్పుడు దుమ్ము, ధూళి, చెత్తాచెదారం చేరకుండా జాగ్రత్త వహించాలి. తాలు, మచ్చ కాయలను తీసి గ్రేడింగ్ చేయాలి. అలాగే, ఒక్కో బస్తాలతో 49 కిలోలకు మించకుండా మార్కెట్‌కు తీసుకురావాలి. తాలు మిర్చి, పండుకాయను వేరు చేసి మార్కెట్‌కు తీసుకొస్తే మంచి ధర లభిస్తుంది.



తేమ అధికంగా ఉండదంతోతో ఆరబెట్టిన మిర్చి

నాణ్యత ఆధారంగానే పంటకు ధర



ప్రతీ పంట నాణ్యత ఆధారంగానే మంచి ధర లభిస్తుంది. మిర్చికి ప్రభుత్వ మద్దతు ధర లేదు. మిర్చి పంటకు జాతీయంగా, అంతర్జాతీయంగా ఉన్న డిమాండ్ ఆధారంగా ధర పలుకుతుంది. రైతులు పంట కోత నుంచి విక్రయించే వరకు సరైన జాగ్రత్తలు పాటిస్తే మార్కెట్‌లో పోటీ ధర లభించే అవకాశం ఉంది.

– ఈ మల్లేశం, ఖమ్మం మార్కెట్ పర్సన్ ఇన్‌చార్జి

సంస్థాగత బలోపేతమే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాద్

ఖమ్మంమయూరిసెంటర్: పార్టీని సంస్థాగతంగా బలోపేతమే లక్ష్యంగా కార్యాచరణ రూపొందించినట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ తెలిపారు. గ్రామస్థాయి నుంచి పార్టీని పటిష్ట పరుస్తూ కార్యకర్తలను ఉద్యమాలకు సిద్ధం చేసేలా ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నామని పేర్కొన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గ కౌన్సిల్ సమావేశ నిర్ణయాలను శనివారం ఆయన ఖమ్మంలో నిర్వహించిన సమావేశంలో వెల్లడించారు. పార్టీ ఆవిర్భవించి వందేళ్లు అయినందున సాధించిన విజయాలు, ఇదే సమయాన ఎత్తుగడల వైఫల్యాలను ప్రజలకు వివరించి భవిష్యత్‌లో బలోపేతం చేసేలా కార్యకర్తలను సిద్ధం చేయనున్నామని తెలిపారు. పార్టీ సభ్యత్వమే గీటురాయిగా కార్యాచరణ మొదలవుతుందన్నారు. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్నందున త్వరలో సమావేశాలు నిర్వహిస్తామని ప్రసాద్ తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు శింగు నర్సింహారావు, తాటి వెంకటేశ్వరరావు, రావి శివరామకృష్ణ, మేకల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు భారత జాతీయ ఆరోగ్య సమ్మేళనం

నేలకొండపల్లి: నేలకొండపల్లిలోని సిద్దార్థ యోగా విద్యాలయంలో ఆదివారం భారత జాతీయ ఆరోగ్య సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ప్రకృతి ఆశ్రమ వైద్యులు కే.వై.రాంచందర్‌రావు తెలిపారు. మండల కేంద్రంలో శనివారం ఆయన మాట్లాడుతూ వివిధ దీర్ఘకాలిక వ్యాధుల నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఈ సమ్మేళనంలోఅవగాహన కల్పిస్తామని తెలిపారు. అలాగే, వంద రకాల దేశవాళీ బియ్యం, వంద రకాల దేశవాళీ కూరగాయల విత్తనాల ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. మగ్గం నేత, మట్టి కుండల తయారీతో పురాతన మల్లఖంబ్ క్రీడా ప్రదర్శన ఏర్పాటుచేసినట్లు తెలిపారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి 3వేల మంది ప్రతినిధులు హాజరుకానున్నందున జిల్లా వాసులు పాల్గొనాలని కోరారు.

అడవి గేదె మృతి కేసులో నలుగురి అరెస్ట్

- విద్యుత్ తీగలకు తాకడంతో మృతి చెందినట్లు నిర్ధారణ
- పరారీలో మరో ఇద్దరు నిందితుల



వివరాలు వెల్లడిస్తున్న ఎఫ్‌డీఓ మంజుల

సత్తుపల్లిటౌన్: విద్యుత్ తీగలతో ఉచ్చు బిగించి అడవి గేదె మృతికి కారకులైన నలుగురిని అరెస్ట్ చేసినట్లు సత్తుపల్లి ఎఫ్‌డీఓ వి.మంజుల తెలిపారు. సత్తుపల్లిలోని కార్యాలయంలో శనివారం ఆమె వివరాలు వెల్లడించారు. సత్తుపల్లి మండలం రేగళ్లపాడులోని జివ్వాజి చుక్కమ్మ పొలం వద్ద ఈనెల 19వ తేదీ ఉదయం ఏడు నెలల గర్భంతో ఉన్న అడవిగేదె విద్యుత్‌షాక్‌తో మృతి చెందినట్లు గుర్తించారు. ఘటనపై విచారణ జరపగా గ్రామానికి చెందిన జివ్వాజి శ్రీనివాసరావు, సున్నం అర్జున్, వడ్డంగి వెంకటేశ్వర్లు, వాడే రవిని బాధ్యులుగా గుర్తించామని తెలిపారు. వీరిని శనివారం అరెస్ట్ చేసి సత్తుపల్లి కోర్టులో హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు వెల్లడించారు. ఇదే ఘటనలో మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారని ఎఫ్‌డీఓ తెలిపారు.

పంట రక్షణ కోసమంటూ..

రేగళ్లపాడులోని ఆర్ఎఫ్ఆర్ భూములకు 2009లో ఇందిర జలప్రభ కింద ప్రభుత్వం ట్రాన్స్‌ఫార్మర్, లైన్ మంజూరు చేసింది. అయితే, పొలాల్లోకి అడవి పందులు వచ్చి పంటలను పాడు చేస్తున్నాయంటూ కొందరు ట్రాన్స్‌ఫార్మర్ నుంచి పొలాల వరకు విద్యుత్ తీగలు బిగించారు. ఈ తీగలకు తాకడంతోనే అడవి గేదె మృతి చెందినట్లు విచారణలో తేలింది. వేటగాళ్లు చాలా కాలంగా పంటల రక్షణకు పేరిట ఇలా చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కాగా, షెడ్యూల్–1 జాబితాలో ఉన్న అడవి గేదె మృతి కేసులో నిందితులకు మూడేళ్ల నుంచి ఏడేళ్ల వరకు జైలుశిక్ష పడే అవకాశం ఉందని ఎఫ్‌డీఓ మంజుల తెలిపారు. వన్యప్రాణులకు హానీ కలిగించేలా ఎవరు వ్యవహరించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సత్తుపల్లి, తల్లాడ రేంజర్లు పి.స్నేహలత, కె.అరవింద్ పాల్గొన్నారు.

8 కేజీల గంజాయి సీజ్..

- ఎనిమిది మంది అరెస్ట్, పరారీలో ఇంకొకరు
- వివరాలు వెల్లడించిన సీపీ సునీల్‌దత్



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీపీ సునీల్‌దత్, పక్కన అధికారులు

ఖమ్మంక్రైం: ఖమ్మం రాపర్తినగర్ ఫ్లై ఓవర్ వద్ద శనివారం ఖమ్మం టూటౌన్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంయుక్త చేపట్టిన తనిఖీల్లో ఎనిమిది కేజీల గంజాయి పట్టుబడింది. ఈమేరకు వివరాలను పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ వివరాలను వెల్లడించారు. రాపర్తినగర్ ఫ్లై ఓవర్ వద్ద పోలీసులు చేపట్టిన తనిఖీల్లో తొమ్మిది మంది అనుమానాస్పదంగా కనిపించారు. దీంతో పోలీసులు ప్రశ్నిస్తుండగానే ఓ వ్యక్తికి పారిపోగా మిగతా వారిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేశారు. దీంతో ఎనిమిది కేజీల గంజాయి లభించింది. వైరాలోని సంతబజార్‌కు చెందిన సిరిగిరి సురేష్, చేపలకాలనీకి చెందిన కంద్ర సతీష్, ముసలిమడుగుకు చెందిన కరకాని ఇంద్రసేన గోపితో పాటు ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేటకు చెందిన జీవన్, నెమలి గ్రామానికి చెందిన మునుబోలు ఏడుకొండల గణశేఖర్ ఒడిశా నుంచి గంజాయిని తీసుకొస్తారు. అనంతరం హైదరాబాద్‌కు చెందిన శెట్టిపల్లి శశి, ఖమ్మంలోని గోపాలపురానికి చెందిన బి.పాంగురమేష్, పొదిలి జశ్వంత్, కొణిజర్లకు చెందిన కోమటి సురేష్‌కు అందజేస్తే వారు విక్రయిస్తారు. ఈమేరకు వీరంతా గంజాయితో వెళ్తూ పోలీసులకు పట్టుబడగా జీవన్ పారిపోయాడు. ఈమేరకు నిందితుల నుంచి గంజాయితో పాటు ఒక స్కూటీ, ఏడు ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని సీపీ తెలిపారు. కాగా, నిందితులపై గతంలోనూ కేసులు నమోదు కాగా, వీరిని అరెస్ట్ చేసిన ఖమ్మం టౌన్, టాస్క్‌ఫోర్స్ ఏసీపీలు ఎస్.వీ.హరికృష్ణ, జె.శివరమేష్‌తో పాటు ఉద్యోగులను సీపీ అభినందించారు.

చీటింగ్ కేసు నమోదు

రఘునాథపాలెం: ప్లాట్లు లేకుండానే ఉన్నట్లు నకిలీ డాక్యుమెంట్ల ద్వారా మోసం చేశారని అందిన ఫిర్యాదుతో ఖమ్మంకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి ఎం.లక్ష్మీనరసయ్యపై శనివారం రఘునాథపాలెం పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. ఖమ్మంకు చెందిన వంగర వెంకటేశ్వర్లు, జవ్వాజి శ్రీనివాసరావు, కోయ కళావతికి కోయచలక పరిధి సర్వే నంబర్ 190, 191ల్లో వెయ్యి చదరపు గజాల స్థలం ఉందంటూ ఐదు ప్లాట్లుగా విభజించి 2000వ సంవత్సరంలో లక్ష్మీనరసయ్య విక్రయించినాడు. అయితే, వారు వెళ్లి చూడగా ఆయా సర్వే నంబర్లలో భూమి లేకపోవడంతో లక్ష్మీనరసయ్య ఆరా తీయగా చంపుతానని బెదిరించాడు. దీంతో వెంకటేశ్వర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

సాక్షి సండే క్లాసిఫైడ్స్

Education

DISTANCE EDUCATION

■ పారామెడికల్ ఆల్, సిద్ధ, నేచురోపతి, యోగా పంచకర్మ, యునాని ELe.Homeo ఎలక్ట్రికల్ & ఎలక్ట్రానిక్స్, ఫైర్ & సేఫ్టీ, హోటల్ మేనేజ్‌మెంట్, గోల్డ్ ఎప్రైజర్, ఫిషరీ, www.bssve.in అన్ని కోర్సులకు. ఫోన్: 99639 76632 [V-2349]

Real Estate

PLOT FOR SALE

■ న్యూ కలెక్టరేట్‌కు సమీపంలో Indo Qatar వారి ధర్మస్థలి ఫేజ్-1 వెంచర్‌లో 222 గజముల తూర్పు ఫేసింగ్ ప్లాటు అమ్మకమునకు కలదు. సంప్ర. 91213 69769 [M-1167502]

TO-LET

■ ఖమ్మంలో నియర్ సుందర్ టాకీస్ రోడ్, భారత సీడ్స్ పైన 1st ఫ్లోర్ 1333 Sft. ఆఫీసులకు, ఇతరులకు కమర్షియల్, గోడౌన్స్ అద్దెకు/ లీజుకు ఇవ్వబడును. సంప్ర. 94921 65937. [M-1233753]

HOUSE FOR SALE

■ కల్లూరు NSP క్రాస్ రోడ్ తిరుపతమ్మ గుడి బజారులో 5 సెంట్లలో ఉన్న 4 గదుల రేకుల ఇల్లు అమ్మకమునకు కలదు ✆ 89850 08459 [B-1336]

Services

BUSINESS OFFER

■ ద్వారకాఎంటర్‌ప్రైజెస్:పేపర్‌ప్లేట్స్ & LEDమిషన్స్‌పై ప్రతి నెల అధిక ఆదాయం, అద్భుత అవకాశం, ఉచిత ముడి పదార్థాలు, 100% తిరిగి కొనుగోలు ఒప్పందం. 9310515624, 8800496710 [G-1427]

■ అద్భుత అవకాశం నెలకి 30 వెల పైన పైగా సంపాదించుకున్న గొప్ప అవకాశం, రిటైర్డ్ పర్సన్స్, గృహిణులు మార్కెటింగ్ పర్సన్స్ ఎల్‌ఐసి ఏజెంట్స్ మొదలైనవారు సంప్ర: 9848214521 [W-1220969]

■ 18-28 సం॥ల యువతి యువకులకు,RS 49 K స్వల్ప పెట్టుబడిలో కల్‌ప్రాంపైజ్‌తో పర్మినెంట్‌బిజినెస్ ఆదాయం. మల్టీ సర్వీసెస్+ట్రైనింగ్+డైలీ సపోర్ట్@15 సం॥ల నమ్మకమైన సర్టిఫైడ్ సంస్థ WWI-Hyd. Ph: 9908743603 [HA-2583]

గెల్లా హోమియో కేర్

■ అన్ని దీర్ఘకాలిక వ్యాధులకు హోమియో ఔషధం, గెల్లా హోమియో కేర్, మసీదు వద్ద, కమాన్ బజార్, ఖమ్మం. సంప్ర. డా॥ గెల్లా రాజేశ్వరరావు, సెల్ : 98661 85050. [M-1221899]

Wanted

■ Educational Society నందు పని చేయుటకు అనుభవంగల లేడి రిషప్షనిస్ట్ కావలెను. రోటరీనగర్, HP పెట్రోల్ బంక్ వెనుక, ఖమ్మం. సెల్ : 90327 59848, 77020 10177. [M-1167508]

■ ఖమ్మం లోకల్ ప్రముఖ సంస్థలో పని చేయుటకు సెక్యూరిటీ గార్డులు & సూపర్‌వైజర్స్ కావలెను. జీతం: 11-13 వేలు, 12 గంటల డ్యూటీ. 7036191924, 8121046046. [M-1167600]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9573633520, 9059633520. [M-1167506]

■ రామకృష్ణ గ్రూప్ (A.P&న్యూఢిల్లీ No.1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషెంట్ల సేవకు వంట/ఇంటి పని, బేబీకేర్‌కైM/Fవర్కర్లు కా.భో+వ+జీతం 15-21 వేలు. ఏజెంట్లకు5వేలుకమీషన్.9052671122/9133271122 [H-787758]

■ విజయవాడలో A/C & Coolers రెంటల్ (tower-ac.com) కంపెనీకి A/C టెక్నీషియన్స్-3, డ్రైవర్లు-3, హెల్పర్లు-5, 30సం.లోపు జీ:18 - 25,000 ట్రైనింగ్ / భోజనం / వసతి ఫ్రీ. ✆ 91771 77244 [B-1255218]

■ విజయవాడలో ఇంటివద్దనే వుండి పేషెంట్‌లను /పెద్దవారిని చూసుకొనుటకు అనుభవం వున్న M/F కేర్ టేకర్స్ / నర్సులు కావలెను. రూమ్+భోజనం + మంచి జీతం ✆ 91608 35559, 78158 35561 [B-624]

■ పనివారు కావలెను. హైదరాబాద్, బెంగళూరులో ఉండి ఇంటిపని, వంటపని, వృద్ధుల సేవ, పిల్లల పోషణకు స్త్రీలు, కావలెను. సంప్ర॥ 9391912949, 040-40123376. [H-801571]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ /నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18K. ఫోన్: 9160900024/ 9640400073 [H-793681]

■ బాలాజీ గ్రూపు, (AP, న్యూ ఢిల్లీ No.1) శ్రీమంతుల ఇళ్ళలో వృద్ధులకు/పేషంట్ల సేవకు, ఇంటి / వంట పని, బేబీకేర్ కొరకు M/F వర్కర్స్ కావలెను. భో+వ:జీ: 15-21 వేలు, ఏజెంట్లకు 5 వేలు కమీషన్ ✆ 63010 53690, 92814 52843 [B-1239063]

■ Urgent Requirement of Experienced Marketing and Sales Managers and senior executives with 5+years experience to promote Educational products and services to schools. Contact: 9502842233/ 9177244424 [HA-1793]

WANTED TEACHERS

■ Wanted Teachers Pre-Primary Teachers (Fluency English) మరియు ఆయాలు కావలెను. గాంధీచౌక్, ఖమ్మం. సంప్ర. 93927 78297, 91005 40892. [M-1167507]

ప్రకటన గోరంత! స్పందన కొండంత!!

సాక్షి క్లాసిఫైడ్స్

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు మా ప్రతినిధులను సంప్రదించండి

వివరాలకు :

ఖమ్మం	: 9705444182
	9010299957
కొత్తగూడెం	: 9010223783
పాల్వంచ	: 9705444183
భద్రాచలం	: 9951602914
మణుగూరు	: 9705944416
సత్తుపల్లి	: 9652868642
మధిర	: 9949927792

సాక్షి ద్వారా మీ చిన్నారి పుట్టిన రోజు శుభాకాంక్షలను తెలియజేయండి

కేవలం రూ. 500/- మాత్రమే

(GST 5% అదనం)

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఖేలో ఇండియా టోర్నీకి ఖమ్మం అథ్లెట్లు



క్రీడాకారులతో కలెక్టర్, డీవైఎస్ఓ తదితరులు

ఖమ్మం స్పోర్ట్స్: కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యాన ఖేలో ఇండియా పోటీల్లో భాగంగా చెన్నైలో ఈనెల 23నుంచి 25 వరకు నిర్వహించే జాతీయస్థాయి అథ్లెటిక్స్ మీట్‌కు ఖమ్మం అథ్లెటిక్స్ అకాడమీకి చెందిన ఇద్దరు ఎంపికయ్యారు. ఈమేరకు ఏ.గౌతమ్ 200 మీటర్ల పరుగు, డి.వివేక్‌చంద్ర 110 హార్డిల్స్‌లో బరిలోకి దిగనున్నారు. ఈసందర్భంగా క్రీడాకారులను ఖమ్మం కలెక్టర్ వీ.పీ.గౌతమ్, డీవైఎస్ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, అకాడమీ చీఫ్ కోచ్ ఎం.డీ.గౌస్, అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎం.డీ.షఫీక్ అహ్మద్ తదితరులు అభినందించారు.

ఎస్ఎంసీ ఎన్నికలకు నోటిఫికేషన్

ఖమ్మం సహకారనగర్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఎస్ఎంసీ)ల ఎన్నికకు సంబంధించి నోటిఫికేషన్ శనివారం విడుదల చేశామని డీఈఓ ఈ.సోమశేఖరశర్మ తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రుల వివరాలతో కూడిన ఓటర్ల జాబితా విడుదల చేయగా, దీనిపై అభ్యంతరాలు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.

చెక్‌డ్యాం నిర్మాణానికి సర్వే..

వైరారూరల్: వైరా మండలం స్నానాల లక్ష్మీపురంలోని పుణ్యక్షేత్రమైన శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయ సమీపాన వైరా నదిపై చెక్‌డ్యాం నిర్మాణానికి అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఇక్కడ చెక్‌డ్యాం నిర్మించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశించడంతో శనివారం నీటి పారుదల శాఖ సీఈ విద్యాసాగర్, ఈఈ బాబూరావు, డీఈ పి.శ్రీనివాస్ ఆధ్వర్యాన సర్వే చేపట్టారు. లక్ష్మీపురంలోని వైరా నదిలో ఉన్న కాజ్‌వేకు కింది భాగాన చెక్‌డ్యాం నిర్మాణానికి నిర్ణయించినట్లు తెలిసింది. నదిలో వంద మీటర్ల పొడవుతో నాలుగు నుంచి ఐదు అడుగుల ఎత్తులో చెక్‌డ్యాం నిర్మించనున్నట్లు సమాచారం. తద్వారా 180 మీటర్ల లోతులో దాదాపు కిలోమీటర్ మేర ఎప్పుడూ నీరు నిల్వ ఉంటుందని చెబుతున్నారు. అలాగే, గండుగలపాడు -ముసలిమడుగు మధ్య లింక్‌రోడ్డును ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తహసీల్దార్ శ్రీనివాసరావు సర్వే చేశారు.

బాలలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు

నేలకొండపల్లి: నిబంధనలకు విరుద్ధంగా బాలలను పనిలో పెట్టుకునే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఖమ్మం కార్మిక శాఖ సహాయ అధికారి వెంగమాంబ హెచ్చరించారు. మండల కేంద్రంలో పలు దుకాణాల్లో శనివారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోకినేపల్లి, గంధసిరికి చెందిన ఇద్దరు బాలలు పనిచేస్తుండగా గుర్తించి యజమానులపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా వెంగమాంబ మాట్లాడుతూ ఎవరైనా 18 ఏళ్ల లోపు బాలబాలికలను పనిలో పెట్టుకుంటే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. తనిఖీల్లో పోలీసులు, చైల్డ్‌లైన్ సిబ్బంది పాల్గొన్నారు.

హ్యూండాయ్ నూతన మోడల్ కారు విడుదల



కారును విడుదల చేస్తున్న ఆర్టీఓ గౌస్‌పాషా తదితరులు

ఖమ్మంఅర్బన్: హ్యూండాయ్ కంపెనీ నూతనంగా రూపొందించిన న్యూ క్రెటా కారును శనివారం ఖమ్మం శ్రీశ్రీసర్కిల్‌లోని భారత్ హ్యూండాయ్ షోరూంలో జిల్లా రవాణా శాఖ అధికారి మహ్మద్ గౌస్‌పాషా విడుదల చేశారు. ఈసందర్భంగా షోరూం సీఈఓ సీహెచ్.శయనకృష్ణ కారు ప్రత్యేకతలను వివరించారు. భారత్ హ్యూండాయ్ గ్రూప్ చైర్మన్ కేశా సుభాష్‌చంద్రబోస్, ఎస్‌బీఐ ఆర్ఎం విజయ్‌కుమార్, యూబీఐ డీజీఎం కె.హన్మంతరెడ్డి, ఎంవీఐ వరప్రసాద్, యూట్యూబర్ రంగబాబు తదితరులు పాల్గొన్నారు.

విమానం చక్కర్లతో ఆందోళన

కూసుమంచి: మండలంలోని పలు గ్రామాల మీదుగా శనివారం విమానం చక్కర్లు కొట్టడంతో ప్రజలు ఆందోళన చెందారు. తక్కువ ఎత్తులో విమానం వచ్చివెళ్తుండడంతో కొందరు గుర్తించారు. కానీ ఈ విమానం ఎందుకు వచ్చిందో తెలియక, అధికారుల నుంచి ప్రకటన వెలువడకపోవడంతో ఆరా తీయడం కనిపించింది. మండలంలోని పాలేరు, నాయకన్‌గూడెం, కూసుమంచి, ముత్యాలగూడెం గ్రామాల మీదుగా విమానం వెళ్లిందని స్థానికులు తెలిపారు.

పూర్వవిద్యార్థుల చేయూతతో కళాశాలలో అల్పాహారం

కల్లూరు: కల్లూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం నుంచి విద్యార్థులకు అల్పాహారం అందజేస్తున్నారు. ఈకార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ కుతుంబాక శ్రీనివాసరావు, పూర్వ విద్యార్థి పసుమర్తిచందర్‌రావు ప్రారంభించారు. 1977–79 విద్యాసంవత్సరం ఇంటర్ చదివిన విద్యార్థులు 35 రోజుల పాటు 200 మంది విద్యార్థులకు రోజూ అల్పాహారం అందించేందుకు ముందుకొచ్చారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ వివిధ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు ఇబ్బంది పడకుండా పూర్వవిద్యార్థులు అల్పాహారం సమకూర్చడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఎస్.కే.జానీమియా, దోసపాటి భాస్కర్‌రావు, పసుమర్తి వెంకటేశ్వరరావు, ఎస్.కే.ఇస్మాయిల్, సాదిక్ అలీ, వేల్పుల కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

వాహన నంబర్ల ట్యాంపరింగ్‌పై కేసులు

ఖమ్మంక్రైం: నిబంధనలకు విరుద్ధంగా రాకపోకలు సాగిస్తూ కెమెరాలకు చిక్కకుండా నంబర్ ప్లేట్‌లో ఒకటి, రెండు సంఖ్యలు తొలగించి తిరుగుతున్న వాహనదారులపై చీటింగ్ కేసులు నమోదు చేసినట్లు ఖమ్మం ట్రాఫిక్ ఏసీపీ సారంగపాణి తెలిపారు. ఇటీవల స్పెషల్ డ్రైవ్ నిర్వహించగా నంబర్‌ప్లేట్ లేకుండా కొందరు, నంబర్లు మార్చి ఇంకొందరు, రిజిస్ట్రేషన్ చేయించుకోకుండా మరికొందరు పట్టుబడ్డారని పేర్కొన్నారు. ఈ మేరకు వీరిపై కేసు చేసినట్లు ఏసీపీ తెలిపారు.

DCCB KHAMMAM | ది జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ లి॥, ఖమ్మం.

ప్రధాన కార్యాలయం, మహాత్మాగాంధీ రోడ్, గాంధీచౌక్, ఖమ్మం.

బహిరంగ వేలం ప్రకటన

ఇ.పి.నెం. 1029/2022-23

శ్రీమతి నరుకుళ్ల జ్యోత్స్నారాణి, భర్త: [illegible], నివాసం : సత్తుపల్లి మం॥, ఖమ్మం జిల్లా గారు. వీరు NAML ఋణము/లోన్ రూపేణ జిల్లా కేంద్ర సహకార బ్యాంక్, ప్రధాన కార్యాలయం, ఖమ్మం బ్రాంచి నందు నందు ఋణము తీసుకొని సకాలంలో చెల్లించక వాయిదా మీరియున్నారు. అట్టి ఋణము వసూలు నిమిత్తమై వారి ఆస్తిని బహిరంగ వేలం ద్వారా విక్రయించబడును రాబట్టుటకు ది.25-01-2024 తేదీన ఉదయం గం॥ 11:45 ని॥లకు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్, సత్తుపల్లి బ్రాంచి నందు బహిరంగ వేలము నిర్వహించబడును. కనుక ఆసక్తి గల వ్యక్తులు వేలములో పాల్గొని ఈ క్రింద తెలుపబడిన షరతులకు లోబడి కొనుగోలు చేసుకొనవచ్చును.

వేలము వేయు స్థలము వివరములు :

క్ర. సం.	సర్వే నెం.	విస్తీర్ణం	ఆస్తి యొక్క యజమాని పేరు	హద్దులు	రెవెన్యూ గ్రామం	రెవెన్యూ మండలం
1.	105/B H.No. 15-155/2	266 చ.గ॥	శ్రీమతి నరుకుళ్ల జ్యోత్స్నారాణి	తూర్పు: [illegible] పడమర: సత్తుపల్లి టు [illegible] ఆర్ & బి రోడ్డు ఉత్తరం: [illegible] దక్షిణం: [illegible]	సత్తుపల్లి	అయ్యగారిపేట

వేలము షరతులు : 1. వేలములో పాల్గొను పాటదారుడు రూ॥ 15,000/- ధరావతు (ఇ.యమ్.డి.) వేలమునకు ముందు సేల్ ఆఫీసర్ గారికి చెల్లించి వేలములో పాల్గొనవలెను. 2.అత్యధిక పాటదారుడు పాటపాడిన మొత్తములో 15% సొమ్ము వెంటనే చెల్లించవలెను. అట్లు చెల్లించని యెడల సదరు భూమిని తిరిగి వెంటనే వేలము వేయబడును. 3. మిగిలిన 85% సొమ్మును మరియు రిజిస్ట్రేషన్ కొరకు స్టాంప్ డ్యూటీ విలువ వేలం తేదీ నుండి 15 రోజులలోపు చెల్లించవలెను. అట్లు చెల్లించని యెడల ముందు చెల్లించిన 15% సొమ్మును నిబంధనల ప్రకారం ప్రభుత్వ ఖాతాకు జమచేసి తిరిగి వేలం వేయబడును. 4. వేలము పాటలో పాల్గొనువారు సదరు గ్రామంలో గల భూములను సర్వే నెంబరు ప్రకారం తనిఖీ చేసుకొనవచ్చును. 5. వేలములో సరియైన ధర వచ్చినప్పుడు మాత్రమే పాటను ఖరారు చేయబడును. 6. వేలములో సరియైన ధర రానిపోయినను మరియు ఏ కారణములు చూపకుండా వేలము నిలుపు చేయుటకు లేదా వాయిదా వేయుటకు సేల్ ఆఫీసర్ గారికి పూర్తి అధికారములు కలవు. 7. భూముల వివరములు ఇమ్మటలో గాని వైశాల్యము వివరముల అంచనా వేయుటలో కలుగు తప్పులకు బ్యాంకు వారు బాధ్యులు కారని స్పష్టంగా తెలుసుకొనవలెను.

ఇతర వివరములకు కొరకు 9948737755, 7993448888, 9948106509 నంబర్‌కు సంప్రదించగలరు

మేనేజర్ / సేల్ ఆఫీసర్
జిల్లా కేంద్ర సహకార బ్యాంక్
ప్రధాన కార్యాలయం, ఖమ్మం.

DCCB KHAMMAM | ది జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ లి॥, ఖమ్మం.

ప్రధాన కార్యాలయం, మహాత్మాగాంధీ రోడ్, గాంధీచౌక్, ఖమ్మం.

బహిరంగ వేలం ప్రకటన

ఇ.పి.నెం. 1541/2022-23

మెస్సర్స్: శ్రీ వెంకటేశ్వర వర్మి కంపోస్ట్, ప్రొ॥ టీకటి ప్రణవి, నివాసం : ఖమ్మం అర్బన్, ఖమ్మం జిల్లా గారు. వీరు PMEGP ఋణము/లోన్ రూపేణ జిల్లా కేంద్ర సహకార బ్యాంక్, ప్రధాన కార్యాలయం, ఖమ్మం బ్రాంచి నందు నందు ఋణము తీసుకొని సకాలంలో చెల్లించక వాయిదా మీరియున్నారు. అట్టి ఋణము వసూలు నిమిత్తమై వారి ఆస్తిని బహిరంగ వేలం ద్వారా విక్రయించబడును రాబట్టుటకు ది.25-01-2024 తేదీన ఉదయం గం॥ 11:45 ని॥లకు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్, పెనుబల్లి బ్రాంచి నందు బహిరంగ వేలము నిర్వహించబడును. కనుక ఆసక్తి గల వ్యక్తులు వేలములో పాల్గొని ఈ క్రింద తెలుపబడిన షరతులకు లోబడి కొనుగోలు చేసుకొనవచ్చును.

వేలము వేయు స్థలము వివరములు :

క్ర. సం.	సర్వే నెం.	విస్తీర్ణం	ఆస్తి యొక్క యజమాని పేరు	హద్దులు	రెవెన్యూ గ్రామం	రెవెన్యూ మండలం
1.	303/2, 305/1, 305/2, 306/Ka/1, 323/1, 324/1, 324/2 & 325/3	ఎ॥ 8-00 కుంటలు	శ్రీమతి టీకటి ప్రణవి	తూర్పు: సి.హెచ్.రంజిత్‌కుమార్ భూమి పడమర: సి.హెచ్.కిరణ్‌కుమార్ భూమి ఉత్తరం: సి.హెచ్.రామారావు భూమి దక్షిణం:సి.హెచ్.నారాయణ & సి.హెచ్.నరేంద్రకుమార్ భూమి	పెనుబల్లి	గౌరారం
2.	326/1, 327/1, 328/1, 329/Ka/1, 331/Ga/3, 335 &, 338/2/1	ఎ॥ 5-37 కుంటలు	శ్రీమతి టీకటి ప్రణవి	తూర్పు: సి.హెచ్.రంజిత్‌కుమార్ భూమి పడమర: సి.హెచ్.కిరణ్‌కుమార్ భూమి ఉత్తరం: సి.హెచ్.రమేష్ భూమి దక్షిణం:సి.హెచ్.నారాయణ & సి.హెచ్.నరేంద్రకుమార్ భూమి	పెనుబల్లి	గౌరారం
3.	451/4/ yee/1,	ఎ॥ 5-20 కుంటలు	శ్రీమతి టీకటి ప్రణవి	తూర్పు: సి.హెచ్.[illegible] నరసింహారావు భూమి పడమర: [illegible] భూమి ఉత్తరం: [illegible] భూమి దక్షిణం:రోడ్డు	పెనుబల్లి	గౌరారం

వేలము షరతులు : 1. వేలములో పాల్గొను పాటదారుడు రూ॥ 15,000/- ధరావతు (ఇ.యమ్.డి.) వేలమునకు ముందు సేల్ ఆఫీసర్ గారికి చెల్లించి వేలములో పాల్గొనవలెను. 2.అత్యధిక పాటదారుడు పాటపాడిన మొత్తములో 15% సొమ్ము వెంటనే చెల్లించవలెను. అట్లు చెల్లించని యెడల సదరు భూమిని తిరిగి వెంటనే వేలము వేయబడును. 3. మిగిలిన 85% సొమ్మును మరియు రిజిస్ట్రేషన్ కొరకు స్టాంప్ డ్యూటీ విలువ వేలం తేదీ నుండి 15 రోజులలోపు చెల్లించవలెను. అట్లు చెల్లించని యెడల ముందు చెల్లించిన 15% సొమ్మును నిబంధనల ప్రకారం ప్రభుత్వ ఖాతాకు జమచేసి తిరిగి వేలం వేయబడును. 4. వేలము పాటలో పాల్గొనువారు సదరు గ్రామంలో గల భూములను సర్వే నెంబరు ప్రకారం తనిఖీ చేసుకొనవచ్చును. 5. వేలములో సరియైన ధర వచ్చినప్పుడు మాత్రమే పాటను ఖరారు చేయబడును. 6. వేలములో సరియైన ధర రానిపోయినను మరియు ఏ కారణములు చూపకుండా వేలము నిలుపు చేయుటకు లేదా వాయిదా వేయుటకు సేల్ ఆఫీసర్ గారికి పూర్తి అధికారములు కలవు. 7. భూముల వివరములు ఇమ్మటలో గాని వైశాల్యము వివరముల అంచనా వేయుటలో కలుగు తప్పులకు బ్యాంకు వారు బాధ్యులు కారని స్పష్టంగా తెలుసుకొనవలెను.

ఇతర వివరములకు కొరకు 9848221429, 7993448888 నంబర్‌కు సంప్రదించగలరు

మేనేజర్ / సేల్ ఆఫీసర్
జిల్లా కేంద్ర సహకార బ్యాంక్
ప్రధాన కార్యాలయం, ఖమ్మం.